క్లుప్తంగా

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిట



తెనాలి: రాష్ట్రప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఆస్తి విలువను పెంపుదల చేయటంతో భూముల రిజిస్ట్రేషన్‌కు పలువురు శుక్రవారం రిజిస్ట్రేషను కార్యాలయాలకు బారులు దీరారు. దీంతో ఎక్కడికక్కడ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. తెనాలిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉదయం నుంచి ప్రజలు చేరుకున్నారు. మరోవైపు అడపాదడపా సర్వర్లు మొరాయించాయి.

ముగిసిన ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరమ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 8.30 గంటలకే దివ్యాంగులు జిల్లా వైద్యశాలకు చేరుకుని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల ఈఎన్‌టీ డాక్టర్ ఎం.చంద్రబాబు, సత్తెనపల్లి డాక్టర్ మాధురిలు, బాపట్ల అప్తామాలజీ డాక్టర్ ఆషా కిరణ్, నర్సారావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎస్.హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వచ్చే వారం కూడా బుధ, గురు, శుక్ర వారాల్లో క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం



తెనాలి: దేవుని కృప ప్రజలందరిపైన ఉండాలని, ప్రతిష్ట వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. రూరల్ మండలం గ్రామం కొలకలూరులో తెలుగు బాప్టిస్టు సంఘం నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పాస్టర్ నన్నెపాగ సురేష్ ప్రార్థనతో వేడుకలు ఆరంభమయ్యాయి. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'మాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ, సంఘ ప్రెసిడెంట్ ఉన్నం ప్రేమయ్య, వైస్‌ప్రెసిడెంట్ అత్యాల చిట్టిబాబు, సెక్రటరీ సుద్దపల్లి పెద్దబ్బాయి, జాయింట్ సెక్రటరీ కొలకలూరి రవిబాబు, ట్రెజరర్ కొలకలూరి సత్యం, జాయింట్ ట్రెజరర్ ఉన్నం భాస్కరరావు, కొలకలూరి రాజయ్య, సురేష్, నాని, బుజ్జి, హలేలూయ, శరత్, ఏలీయా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి రాజేష్‌కు డాక్టరేట్



కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలోని సచివాలయం 1లో గ్రేడ్ 6 పంచాయతీ కార్యదర్శిగా(డిజిటల్ అసిస్టెంట్) గా విధులు నిర్వహిస్తున్న ఆరే రాజేష్ నాయుడు డాక్టరేట్ సాధించినట్లు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బండి కళ్ళ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామ సచివాలయంలో గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నవారందరూ రాజేష్ నాయుడు ను ఘనంగా శాలువాలతో, పూలమాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భగా ఉద్యోగులు మాట్లాడుతూ రాజేష్ కేఎల్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుంచి 'నోవెల్ అప్రోచెస్ పర్ డిటెక్షన్ ఆఫ్ ఏ ఎఫ్ యు అండ్ బ్రెయిన్ ట్యూమర్ త్రు ఇమేజ్ ఫ్యూజన్' అనే అంశంపై డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. దీనరాజు, రామ్మోహన్, రవిబాబు, ప్రదీప్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

" అయ్యా.. కనీసం నేను కాలం చేసేలోపు అన్నా.. మా ఏరియాలో ఉన్న దోమల సమస్యను పరిష్కరిస్తారా..'' సాక్షాత్తు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పట్టణంలోని అయితానగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆవేదనతో పలికిన మాటలు ఇవి. ఈ మాటలు చాలు.. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో చెప్పేందుకు.. పారని మురుగు, అందులో విపరీతంగా పెరుగుతున్న దోమలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటికొకరైనా జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నా.. అధికారులు మొద్దునిద్ర వీడడం లేదు.



రోడ్ల వెంట గుట్టలుగా ఉన్న చెత్త

పారిశుద్ధ్యం కనుమురుగు!

- తెనాలిలో పడకేసిన పారిశుద్ధ్యం
- వారాల తరబడి సిల్ట్ తీయక పారని మురుగు
- దోమలకు ఆవాసంగా మారుతున్న కాల్వలు, చెత్త కొండలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలిలో పారిశుద్ధ్య నిర్వహణ తీసికట్టుగా మారింది. కాల్వల్లో మురుగు పేరుకుపోయి ఉండటం వల్ల దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగింది. ఇటీవల పట్టణంలో పాదయాత్ర చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి పట్టణానికి చెందిన పలువురు అధ్వాన పారిశుద్ధ్యం, దోమల వ్యాప్తి, స్థానికంగా ఉన్న పలు సమస్యలను తీసుకెళ్లారు. తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షల జనాభా నివశిస్తున్నారు. పట్టణంలోని 40 వార్డులను సౌలభ్యం కోసం తొమ్మిది పారిశుద్ధ్య డివిజన్‌లు అధికారులు విభజించి నిర్వాహణ చేస్తున్నారు. వీటిలో రెండు డివిజన్‌లను ప్రభుత్వ పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తుండగా మిగిలిన ఏడు డివిజన్‌లను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నారు. ప్రతిరోజు 80 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతూ ఉంటుంది.



సిల్ట్ తీయక, పారుదల లేని మురుగు కాల్వ

పట్టణం విస్తరిస్తున్న రీతిలో పెరగని సిబ్బంది

తెనాలి పట్టణం రోజురోజుకు విస్తరిస్తు వస్తోంది. గుంటూరు, విజయవాడకు మధ్యలో ఉండటం .. రాజధాని అమరావతికి అతి సమీపంగా ఉండటంతో ఎక్కువ మంది తెనాలిలో నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే పట్టణంలో మూడు కాల్వలు ఉండటం వల్ల ఇక్కడ నీటికొరత ఉండదు. దీంతో తెనాలి పట్టణం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. పట్టణం పెరుగుతున్న స్థాయిలో ఇక్కడ కార్మికుల సంఖ్య పెరగటం లేదు. కొన్ని దశాబ్దాల క్రితం మంజూరు చేసిన సిబ్బందితోనే ఇక్కడ పారిశుద్ధ్య నిర్వాహణ జరుగుతుంది. వార్డుకు కనీసం పది మందిని కూడా కేటాయించలేని స్థితిలో అధికారులు ఉంటున్నారు. దీంతో ప్రతిరోజు వార్డు మొత్తం చెత్తసేకరణ చేయలేకపోవటం, వారానికి ఒకసారి కూడా మురుగు కాల్వలు బాగు చేయించలేని పరిస్థితులు కన్పిస్తోంది.

మురుగు, దోమలతో తీవ్ర ఇబ్బందులు..

తెనాలి పట్టణంలో మురగు బెడద ఎక్కువగా ఉంటుంది. పట్టణంలోని మురుగు కాల్వలను గత టీడీపీ పాలకులు ఒక ప్రణాళిక ప్రకారం నిర్మించకపోవటం వల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. చిన్న పాటి వర్షానికి సైతం కాల్వలు పొంగి రోడ్లపై మురుగు చేరటం పరిపాటిగా మారింది. అంతేకాకుండా మురుగు ప్రవాహం లేకపోవడంతో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటి వరకు అధికారులు ఫాగింగ్, స్ప్రెయింగ్‌ను చేయించిన దాఖలాలు కన్పించటం లేదు. దోమలులేని కాలం తెనాలిలో ఉండదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైన పాలకులు, మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణలోని లోపాలు సరిచేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతవారణాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వ్యర్థాల నిలయంగా మురుగు కాల్వ

స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం..



తెనాలిలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. రోజువారి కూలీలతో గ్యాంగ్ వర్క్‌లు నిర్వహిస్తూ, వారంలో ఒక రోజు స్ప్రెయింగ్, ఫాగింగ్ జరిగే విధంగా చూస్తున్నాం. పారిశుద్ధ్య నిర్వాహణలో ఎదురవుతున్న సమస్యలు అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

పారిశుద్ధ్య నిర్వహణకు నెలకు రూ.50లక్షలు

సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తెనాలిలో ఒక హెల్త్ ఆఫీసర్, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, నలుగురు హెల్త్ అసిస్టెంట్‌లు, 82 మంది పర్మినెంట్, 320 అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. పారిశుద్ధ్య నిర్వాహణ కోసం 150 పుష్ కాట్‌లు, నాలుగు కాంపాక్టర్‌లు, 13 ట్రాక్టర్‌లు, ఒక చిన్న జేసీబీ ఉంది. వీటితో తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వాహణ చేస్తుంటారు. కాల్వలో ఆయిల్స్ బాల్స్ వేయించటం.. ఫాగింగ్ వంటివి చేస్తుంటారు. హెల్త్ సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగుల జీతాల కోసం నెలకు సుమారు రూ.30లక్షలు, వాహనాల ఇంధనం, బ్లీచింగ్ వంటి వాటి కోసం సుమారు రూ.20లక్షలు వెచ్చిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు వినియోగిస్తున్నా ఆశించిన ఫలితాలు రావటం లేదనే విమర్శ అధికంగా వినిపిస్తోంది.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కావటం కొంత అలస్యం కావటంతో 33వ వార్డు కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ కొంత అసహనం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో అజెండాలోని నాలుగు అంశాలు చదివి ఆమోదించినట్లు ప్రకటించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ తెనాలి పట్టణానికి ఉన్న ఆర్థిక వనరుల ద్వారా అనేక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రోడ్లు, కాల్వల నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో కొందరు ఇళ్ల యజమానులు పని చేసేందుకు అవసరమైన నీటిని ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు ఇలాంటి విషయాలల్లో సహకరించాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

కొల్లిపర: శిరిపురం గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవస్థానం తరఫున రెవెన్యూ కార్యాలయంలో ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశంతో లెనోవా ల్యాప్‌టాప్‌ను తహసీల్దార్ జి.సిద్ధార్థకు శుక్రవారం అందించినట్లు దేవస్థానం ధర్మకర్త నన్నపనేని ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన సేవలు అధికారులు అందించాలని ఉద్దేశంతో ల్యాప్‌టాప్ అందించటం జరిగిందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ జి.సిద్ధార్థ, వీఆర్‌ఓలు ఆంజనేయులను ఘనంగా సత్కరించారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

తెనాలిఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. గాంధీచౌక్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, దాని నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తెనాలికి నూతనంగా ఒక పొక్లెయిన్, ట్రాక్టర్ రావడం జరిగిందన్నారు. వాటితో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పరిచేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి: స్థానిక శివాజీచౌక్‌లోని శ్రీకాళీమాత దేవస్థానం కమిటీ వ్యవస్థాపక చైర్మన్ గుమ్మడి రమేష్ 51వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎర్ర శ్రీనివాసరావు, గవిని దినేష్, నక్కా వెంకటేశ్వర్లు, కందేపి సీతారామయ్య, మాదల కోటేశ్వరరావు, బండ్ల గోపి, టి.బాలకృష్ణయాదవ్, టి.జెమిని, ధూళిపాళ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో నిశ్చలన దృశ్యరూపకం

'ఎత్తిన జెండా దించకోయ్' ప్రదర్శన

తెనాలి: దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల్లో ప్రజాసాహిత్య, సాంస్కృతిక, కళారంగాలు నిర్వర్తించాల్సిన కర్తవ్యాలు, సవాళ్లపై చర్చించి నూతన ప్రజాతంత్ర సంస్కృతి నిర్మాణం కోసమని అఖిలభారత ప్రజాసాహిత్య సాంస్కృతిక వేదిక గుంటూరులో మూడురోజుల సభలను చేపట్టింది. తొలిరోజైన 31వ తేదీన సాహిత్య సభ జరగ్గా, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో చిత్రకళా ప్రదర్శన, ఆంధ్ర ప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్నుంచి వచ్చే కళాకారులతో కళాసాంస్కృతిక ప్రదర్శనలు జరగనున్నాయి. మాక్సిమ్ గోర్కీ నవల 'అమ్మ' నవలను నాటకంగా మలచి గుంటూరు, విజయవాడలో ప్రదర్శించిన కోల్‌కతాకు చెందిన గౌతమ్ ముఖర్జీ బృందం ఈసారి మరో కళాప్రదర్శనతో ఈ వేదికపైకి రానుండటం విశేషం! జనసాహితి నేత దివికుమార్, బృందం రచించి, దర్శకత్వం వహించిన 'ఎత్తిన జెండా దించకోయ్' నిశ్చలన దృశ్యరూపకం మరో ఆకర్షణగా నిలవనుంది. గుంటూరులోని ఎన్జీవో కళ్యాణమండంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు కృష్ణాజిల్లాకు చెందిన కళాకారులు ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తారు. పదకొండు దృశ్యాలుగా సాగే ఈ దృశ్యరూపకంలో సంభాషణలుండవు...కళాకారుల ఆటపాట, హావభావాలు మాత్రమే ఉంటాయి. ఏదైనా దృశ్యంలో లైట్స్ ఆన్ కాగానే కళాకారులు, ఏదొక అంశాన్ని ప్రదర్శిస్తూ నిశ్చలంగా ఉండిపోతారు. ఎర్ర జెండా విశిష్టత, ఆ జెండా నీడలో వచ్చిన విప్లవగీతాలు, కార్మిక, కర్షక, విప్లవ ఉద్యమాలు, మృతవీరుల త్యాగాలు నేపథ్యంలోంచి వినిపిస్తుంటాయి. చికాగో కార్మికులు చిందించిన రక్తంతో ఎరుపెక్కిన దగ్గర్నుండీ కారల్ మార్క్స్, ఎంగెల్స్‌ల ప్రణాళికాపత్రంగా అరుణపతాక పోరాటాల బావుటాగా మారటం, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' నినాదంతో సహా కార్మిక విప్లవాలకు జెండా ఎత్తటం, అణచివేతలు, నిర్బంధాలూ, రైతాంగ పోరాటాలు, జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటం, తెలంగాణ ఉద్యమం, ఆదివాసీ తిరుగుబాట్లు, నక్సల్బరీ, నూతన పారిశ్రామిక విధానాల వ్యతిరేక పోరాటాలపై బ్రీఫింగ్, పాటలు ఉంటాయి. చివరగా ఈ పోరాటన్నిటి గుణపాఠాల వెలుగుల విప్లవోద్యమ ఐక్యతను ముందుకు తీసుకుపోదాం, ఎర్రజెండాను సమున్నతంగా నిలబెడదాం' అంటూ సందేశంతో ముగుస్తుంది.



ప్రదర్శనలో ఒక దృశ్యం (ఫైల్)

భక్తిశ్రద్ధలతో వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



కొల్లిపర: మండల కేంద్రంలోని కొల్లిపరలో ఆర్యవైశ్య సంఘం కల్యాణమండపములో ఆర్యవైశ్య మహిళలు, భక్తులు వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ పూజలు శనివారం పెద్దఎత్తున నిర్వహించారు. కొల్లిపర గ్రామ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు అన్నవరపు రమేష్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, గాజులు, కుంకుమ అందజేశారు. అనంతరం కల్యాణ మండపం ఆవరణలో 2025-26 సంవత్సరానికి చెందిన కొల్లిపర ఆర్యవైశ్య సంఘానికి చెందిన నూతన అధ్యక్షులు, సభ్యుల ప్రమాణ స్వీకారం, వాసవి క్లబ్ సంఘానికి చెందిన నూతన అధ్యక్షులు, సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాలు నిర్వహించారు. సుగ్గుల సురేష్, చుండూరు వెంకటరత్నం, కాజ వెంకటశివప్రసాదు, రామారావు, పూర్ణ, ఆర్యవైశ్యులు, మహిళలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే ప్రజాఉద్యమం

రాజధాని నిర్మాణం-రాష్ట్రాభివృద్ధి జాతలో సీపీఎం నేతలు

తెనాలి: భారత కమ్యూనిస్ట్ పార్టీ 27వ మహాసభలు నెల్లూరులో జరుగనున్న సందర్భంగా తాడేపల్లి నుంచి నెల్లూరుకు వెళుతున్న సీపీఎం రాజధాని నిర్మాణం - రాష్ట్రాభివృద్ధి జాత శుక్రవారం తెనాలి చేరుకున్న సందర్భంగా స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక మార్కెట్ సెంటర్లో ప్రజలనుద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి యార్లగడ్డ నేతాజీ మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ప్రజాఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రపంచ బ్యాంక్ రాజధాని కాకుండా ప్రజల రాజధానిని నిర్మించాలని డిమాండ్ చేశారు. అప్పుగా కాకుండా కేంద్రం నుంచి హక్కుగా రావాల్సిన నిధులు తీసుకువచ్చి అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టాలనీ, రాజధాని నిర్మాణ పనులను స్థానికులకే అప్పగించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఆరుమాసాలు దాటినందున రైతులకు పంటలకు ఇస్తానన్న నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించి తక్షణమే ప్రైవేటీకరణ ఆపుతునట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని చెప్పారు. పార్టీ నాయకులు ఎం.భావనారాయణ ఎం.రవి, బూరగడ్డ వెంకటేశ్వరరావు, కొల్లిపర బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, గద్దె రవీందర్‌రావు, షేక్ హుస్సేన్ వలి, గండికోట వెంకటసుబ్బయ్య, బొనిగల సుబ్బారావు, ములకా శివకుమారి పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి నాయకులు వెనుజుల సుబ్బారావు, నాగిరెడ్డి, రాజ్యలక్ష్మి, చల్లపల్లి కిన్నెర తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు.



జాతకు స్వాగతం పలికిన స్థానిక నేతలు

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

తెనాలి: తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక కొత్తపేటలోని ఇన్ఫర్మేటిక్స్ సహకారంతో అదే సంస్థలో ఏర్పాటుచేసిన శిక్షణను ఎస్‌బీఐ గంగానమ్మపేట బ్రాంచి మేనేజరు కె.మాధవీలత, సీనియర్ న్యాయవాది తాడిబోయిన బుచ్చిరాజు ప్రారంభించారు. సభకు మేకతోటి ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. ఈనెల 8వ తేదీనుంచి 30 వరకు పేర్లు నమోదు చేసుకున్న 20-40 సంవత్సరాల మహిళలకు తొలిదశ శిక్షణనిస్తారు. తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు సునీల్ మాట్లాడుతూ సమాజంలో అవసరమైనవారికి మెరుగైన భవిష్యత్తును కల్పించేందుకు అవసరమైన మార్గాన్ని ఏర్పరచేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. కంప్యూటర్ సంస్థ అధినేత శ్రీనివాసరెడ్డి, అచ్యుత సాంబశివరావు మాట్లాడారు.

పీడిత ప్రజల సమస్యలపై గళమెత్తిన గద్దర్



తెనాలిఅర్బన్: బడుగు బలహీన వర్గాల్లో తన పాటల ద్వారా చైతన్యం తీసుకువచ్చిన కవి గద్దర్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజా కవి గద్దర్ 76వ జయంతిని రైల్వేస్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో కారంచేడు మారణకాండను ఖండిస్తూ అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. పేదల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, నాయకులు కుర్రా జశ్వంత్ యాదవ్, కె.జేసుబాబు, ఉన్నవ సల్మాన్, పెరికల అరుణ్ కుమార్, సయ్యద్ ఖాదీ మస్తాన్ బబ్లూ, టి.శరత్, ఎ.బాబీ, షేక్ సాధిక్, బడుగు రమేష్, కె.స్వామి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం రోజున శ్రీఅమరజీవి పొట్టిశ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి గుంటూరు జిల్లా అధ్వర్యంలో స్థానిక మహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు పొట్టి శంకర నారాయణ, ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, ఉపాధ్యక్షుడు ఆలపాటి శివనరసింహారావు, ఆరవేటి బాలగణేష్, పద్మనాభుని నరసింహారావు, కొలిపాకుల రమేష్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.